సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 2 । జూలై । 2025



తిప్పలు తప్పవా..?

వర్షాలు, వరదలొస్తే అనేక గ్రామాలకు లో-లెవెల్ చప్టాలతో రాకపోకలు స్తంభిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 8లో



ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాల కోసం ఖమ్మంలో కౌన్సెలింగ్ ప్రారంభమైంది. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితరపూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మ వారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా వనమహోత్సవం



మొక్క నాటుతున్న ఈఓ రమాదేవి

శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో మంగళవారం వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈఓ ఎల్.రమాదేవి మొక్క నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఏఈఓలు భవానీ రామకృష్ణ, శ్రావణ్‌కుమార్, ఈఈ రవీంద్ర నాథ్, సీసీ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ కత్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘సాహిత్య సూచి’లో జిల్లా వాసికి అవకాశం



డాక్టర్ బాలాచారి నుంచి గ్రంథం అందుకుంటున్న ప్రభాకరాచార్యులు

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ సాహిత్య అకాడమీ రూపొందించిన సాహిత్య గ్రంథ సూచిలో అశ్వారావుపేటకు చెందిన ప్రముఖ రచయిత సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు రాసిన గ్రంథాలకు స్థానం దక్కింది. ఆయన రచించిన కాళికాంబసప్తశతి, రాతిపూలవనం తదితర గ్రంథాల సమగ్ర వివరాలను సూచిలో పొందుపర్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సాహిత్య అకాడమీ కార్యదర్శి డాక్టర్ నామోజు బాలాచారి చేతుల మీదుగా ఈ గ్రంథాన్ని ప్రభాకరాచార్యులు అందుకున్నారు.

కార్పొరేషన్ కార్యాలయంలో తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంగళవారం ట్రైనీ కలెక్టర్ సౌరభ్ శర్మ సందర్శించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ విభాగంలో రికార్డులను, జరుగుతున్న పనులకు సంబంధించిన నివేదికలను పరిశీలించారు. ప్రస్తుతం ఏ పను లు జరుగుతున్నాయి? ఎలా జరుగుతున్నాయి? అని డీఈ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు.

మన్మోహన్ యూనివర్సిటీకి పేరుకుపోయిన బకాయిలు

- కళాశాల నుంచి 85 ఎకరాలు తీసుకున్న ప్రభుత్వం
- నేటికీ అందని పరిహారం, అమలుకు నోచని హామీలు
- తాజాగా వీసీ నియామకం



కొత్తగూడెంలోని ఇంజనీరింగ్ కాలేజీ

ఎర్త్ సైన్సెస్‌లో.. సమస్యలెన్నో

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా విద్యాశాఖ కార్యదర్శి, ఐఏఎస్ అధికారిణి యోగితా రాణాను ప్రభుత్వం నియమించింది. ఇదే ఒరవడిలో యూనివర్సిటీ క్యాంపస్‌లో నెలకొన్న సమస్యలు, రావాల్సిన బకాయిలపై సానుకూల నిర్ణయం తీసుకోవడంతో పాటు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంది.

ఏడాదిలో ఎంతో మార్పు

కొత్తగూడెం నగర పాలక సంస్థ పరిధిలో 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (కాకతీయ)ను ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా మార్చాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పలుమార్లు ప్రభుత్వాన్ని కోరారు. ఎట్టకేలకు ఈ ఏడాది మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా మారుస్తున్నట్టు మార్చి 27న సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. అంతేకాక దీనికి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా నామకరణం చేస్తూ జూన్ 5న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తాజాగా వైస్ చాన్స్‌లర్‌ను నియమిస్తూ సోమవారం మరో జీఓ వెలువరించింది.

అమలుకానీ హామీలు..

గడిచిన దశాబ్ద కాలంగా ఈ యూనివర్సిటీ క్యాంపస్‌లో అనేక సమస్యలు పరిష్కారానికి నోచుకోకుండా ఉన్నాయి. ల్యాబ్‌లు, తరగతి గదులు, ఇండోర్ స్టేడియం, బాలుర హాస్టల్, మెస్ వంటివి పురాతన భవనాల్లో కొనసాగుతున్నాయి. 2023 జనవరి 12న కొత్తగూడెం వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లగా.. ఆయన ప్రత్యేక కమిటీని నియమించారు. క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆ కమిటీ ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, భవిష్యత్‌లో ఆరంభించబోయే కోర్సులను దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాల కల్పనకు రూ.51.31 కోట్లు మంజూరు చేయాలని 2023 ఫిబ్రవరిలోనే సిఫార్సు చేసింది. కానీ నేటికీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధుల ఊసే ఎత్తడం లేదు. దీంతో యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి.

పరిహారం దక్కలేదు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 2016 అక్టోబర్‌లో ఏర్పాటు కాగా, జిల్లా అధికారుల సమీకృత కార్యాలయం, ఎస్పీ ఆఫీస్ నిర్మాణాలకు చెరో 20 ఎకరాల చొప్పున ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ భూములను ప్రభుత్వం తీసుకుంది. ఆ తర్వాత మెడికల్ కాలేజీ కోసం మరో 30 ఎకరాల స్థలం అవసరం పడింది. మొత్తంగా యూనివర్సిటీకి సంబంధించి 85 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం తీసుకుంది. ఇందుకు పరిహారంగా రూ.168 కోట్లు ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ/యూనివర్సిటీకి చెల్లించాలని నాలుగేళ్ల క్రితం లెక్కగట్టారు. కానీ ఇప్పటివరకు పరిహారం కింద యూనివర్సిటీకి చిల్లి గవ్వ చెల్లించలేదు. కాలేజీ నుంచి తీసుకున్న భూముల్లో రూ.వందల కోట్లతో అధునాత భవనాలు నిర్మించగా.. ఇంజనీరింగ్ కాలేజీ మాత్రం ఇప్పటికీ పాత భవనాల్లోనే కొనసాగుతోంది. యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో అడ్మిషన్ల ప్రక్రియతో పాటు గతంలో ఇచ్చిన హామీలు, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ యూనివర్సిటీని తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రజలు కోరుతున్నారు.

అడ్మిషన్లు ఎప్పుడో..

ఈ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విభాగంలో మైనింగ్, కంప్యూటర్ సైన్స్, ఈఈఈ, ఈసీఈ, ఐటీ కోర్సులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఇటీవల పూర్తి స్థాయి యూనివర్సిటీ హోదా దక్కించుకుంది. ఈ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్‌లో జియోలాజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ కోర్సులు ఉండగా పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో జియోలాజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, జియో కెమిస్ట్రీ వంటి కోర్సులు కొత్తగా అందుబాటులోకి తేనున్నారు. అయితే అడ్మిషన్లకు సంబంధించి ఇప్పటి వరకు ఉన్నత విద్యామండలి నుంచి ఎలాంటి లిఖిత పూర్వక ఆదేశాలు రాలేదని ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రాజు తెలిపారు.

బోన్‌లెస్ చేపలతో రుచి, లాభాలు!



బోన్‌లెస్ చేపలతో ప్రయోజనాలను వివరిస్తున్న కలెక్టర్ పాటిల్



చేప ముల్లు తీస్తున్న కలెక్టర్

తయారీ విధానాన్ని వివరించిన కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మునగ సాగు తదితర అంశాలపై ప్రజలకు వీడియోల ద్వారా అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఈసారి మత్స్యకారుల ఆర్థికాభివృద్ధిపై దృష్టి సారించారు. కొత్తగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం చేపల వ్యాపారులు, మత్స్యకారులతో సమావేశమై చేపల్లో ముళ్లు తీయడంపై ప్రత్యేకంగా వివరిస్తూ.. వీటితో తయారుచేసే వంటలు, ఆదాయ మార్గాలపై అవగాహన కల్పించారు. బోన్‌లెస్ చేపలతో టిక్కా తదితర వంటలు చేస్తే ప్రజలకు కొత్త రుచులు అందించొచ్చని.. తద్వారా వారికి పోషకాహారం అందడమేకాక మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. అలాగే చేపల తలలు, మిగిలిన భాగాలతో సూప్ తయారుచేస్తే అదనపు ఆదాయం లభిస్తుందని చెప్పారు. ఇవన్నీ పోగా మిగిలిన వ్యర్థాలతో ఎరువు తయారీకి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ క్రమంలో కలెక్టర్ స్వయంగా చేపల నుంచి ముల్లులు తీస్తూ అవగాహన కల్పించగా, మత్స్యకారులు, ఆదివాసీలు, చేపల పెంపకం, అమ్మకంపై ఆధారపడి జీవించే కుటుంబాలు, ఎస్‌హెచ్‌జీల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పాటిల్ సూచించారు.

9, 10వ తేదీల్లో మెగా ఆధార్ క్యాంపు

ఆధార్ కార్డుల్లో అవసరమైన సవరణల కోసం ఈనెల 9, 10 తేదీల్లో మెగా ఆధార్ క్యాంప్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డుల్లో తప్పులున్నవారు, కొత్త సమాచారం జత చేయాలనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేరు మార్పు, పుట్టిన తేదీ, చిరునామా సవరణ, మొబైల్ నంబర్ అప్‌డేట్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఇందులో కొన్ని వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోవచ్చని, మరికొన్ని మాత్రం ఆధార్ సేవా కేంద్రం నుంచే చేయాల్సి ఉంటుందని తెలిపారు.

మరమ్మతులకు అంచనాలు రూపొందించండి

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతు పనులకు అంచనాలు రూపొందించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన జూనియర్ కళాశాలను సందర్శించారు. ప్రాక్టికల్ ల్యాబ్‌లు, రెనవేషన్ కంప్యూటర్ ల్యాబ్ సామగ్రి, ఎలక్ట్రికల్ ల్యాబ్ సామగ్రి, బాలుర, బాలికల టాయిలెట్ల మరమ్మతులు, ఎలక్ట్రికల్ పనుల వంటి వాటికి అంచనాలు తయారు చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. కళాశాల ఆవరణలోని జీహెచ్‌ఎస్ తరగతి గదులను కూడా రిపేర్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఇన్‌చార్జ్ డీఐఈఓ సులోచనారాణి, పాఠశాల హెచ్‌ఎం సబితా సంధ్యారాణి, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాస్, డీఈ నాగేందర్ పాల్గొన్నారు.

డీసీసీబీ ఉద్యోగుల వేతన సవరణ

- 26–29 శాతం మేర పెరిగే అవకాశం

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) ఉద్యోగుల వేతన సవరణపై ఒప్పందం కుదిరింది. ఈ అంశంపై ఉద్యోగులు మూడేళ్లుగా ఎదురుచూస్తుండగా ఎట్టకేలకు నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ బ్యాంక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు ఆధ్వర్యాన హైదరాబాద్‌లోని టీజీకాబ్ కార్యాలయంలో డీసీసీబీ ఉద్యోగ యూనియన్ల ప్రతినిధులతో మంగళవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఉద్యోగుల ప్రస్తుత వేతనాలపై 26నుంచి 29 శాతం మేర సవరణకు నిర్ణయించి, 2022 నవంబర్ 1 నుంచి అమయ్యేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ చర్చల్లో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఎం.శ్రీనివాస్, నున్నా సందర్‌రావు, జె.అనిల్‌కుమార్, ఎండీ.అఫ్జల్, పి.మంగయ్య, యూ.రవీందర్‌కుమార్, డి.రవి, ఎస్.కే.జానీవియా, ఎం.స్రవంతి, బి.రవికుమార్, పి.వెంకట్రామయ్య, జి.క్రాంతి, ప్రకాష్ పాండే పాల్గొన్నారు. కాగా, వేతన సవరణకు సహకరించిన మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేతన ఒప్పందాన్ని జిల్లాల వారీగా బ్యాంకు పాలకవర్గాలు తీర్మానించి అమలు చేయాల్సి ఉంటుంది.

బాల కార్మికులు కనిపించొద్దు..



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. మంగళవారం ఎస్పీ కార్యాలయంలో సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్–11 వాల్‌పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించి మాట్లాడారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జూలై 1 నుంచి 31 వరకు జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో బాల కార్మికులను గుర్తిస్తారని, ఈ బృందంలో ఒక ఎస్ఐతోపాటు నలుగురు సిబ్బంది ఉంటారని తెలిపారు. పోలీస్ శాఖతో పాటు ఇతర అధికారులతో కలిసి జిల్లావ్యాప్తంగా 5 ప్రత్యేక బృందాలతో నెల రోజుల పాటు బాల కార్మికులను గుర్తించేందుకు దాడులు నిర్వహిస్తామని వెల్లడించారు. బాల కార్మికులను గుర్తిస్తే తక్షణమే 1098కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి స్వర్ణలత లెనీనా, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీసీపీఓ హరికుమారి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఫక్రుద్దీన్, సందీప్, రమాదేవి, విజయకుమారి, ఏసోబు, సూర్యం పాల్గొన్నారు.

చెత్త డంపు.. మురికి కంపు

- పట్టణాల్లో డంపింగ్ యార్డ్‌ల నిర్వహణ అస్తవ్యస్తం
- పలుచోట్ల రోడ్లపైనే పడేస్తున్న సిబ్బంది
- వాసన, పొగ భరించలేక సమీప ప్రజలు అవస్థలు

సాక్షి ఫోకస్

పట్టణాల్లో చెత్త సేకరణ, డంప్ చేయడం ప్రహసనంలా మారింది. చాలా చోట్ల డంపింగ్ యార్డులు ఉన్నా అవి సరిపోక చెత్తను రోడ్లపైనే పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంత ప్రజలు. అటుగా వెళ్లే వారు దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెత్త రీసైక్లింగ్ చేస్తే ఈ సమస్య కొంత పరిష్కారమయ్యే అవకాశం ఉన్నా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, అశ్వారావుపేట, ఇల్లెందులో డంపింగ్ యార్డుల సమస్యలపై ‘సాక్షి’ ఫోకస్..



పాత కొత్తగూడెంలో రోడ్డు పక్కనే డంప్ చేసిన చెత్త

రోడ్డుపైనే చెత్త..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో 29 డివిజన్లు ఉండగా.. వెలువడుతున్న చెత్తను పాతకొత్తగూడెంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. గతంలో రామవరంలో ఉన్న డంపింగ్ యార్డ్ సామర్థ్యానికి మించి చెత్త వెలువడుతుండగా.. దుర్వాసన, చెత్త కాల్చడంతో వెలువడే పొగతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. వారి ఆందోళనతో చెత్తను పాతకొత్తగూడెం డంపింగ్ యార్డుకు మార్చారు. గత నాలుగేళ్లుగా అక్కడే డంప్ చేస్తున్నా.. ప్రస్తుతం ఆ స్థలం కూడా సరిపోక రోడ్డుపైనే పడేస్తున్నారు. కొత్త డంప్ యార్డ్‌ల ఏర్పాటుకు డీఎంఏకు ప్రతిపాదనలు పంపించిన అధికారులు.. స్థలాల ఎంపిక పనిలో పడ్డారు. పట్టణంలో నిత్యం 31 టన్నుల చెత్త వెలువడుతుండగా తరలింపునకు 36 ట్రాలీలు, ఐదు ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు, డీజిల్, నిర్వహణ ఖర్చులు నెలకు రూ.35 లక్షలు అవుతోందని అధికారులు వెల్లడించారు.

పగలు, రాత్రి తేడా లేదు



పాతకొత్తగూడెంలో ఇళ్ల సమీపంలోనే డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేశారు. చెత్త తీసుకొచ్చే వాహనాలు రాత్రీ పగలు తేడా లేకుండా తిరుగుతూనే ఉంటాయి. వాహనాలు చప్పుడు, చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాం.

– మరియమ్మ, పాతకొత్తగూడెం

యార్డు ఉన్నా.. ఉపయోగం సున్నా



నవభారత్ వద్ద చెత్త డంప్ చేస్తున్న దృశ్యం

పాల్వంచ: పాల్వంచలో డంపింగ్ యార్డ్‌కు గతంలో 11 ఎకరాలు కేటాయించారు. అయినా పలుచోట్ల రోడ్లపైనే చెత్త వేస్తున్నారు. శివనగర్ పక్కన ఇప్పటికే భారీ డంపింగ్ యార్డు ఉంది. మసీదు గుట్టకు వెళ్లే దారిలోనూ చెత్త డంప్ చేస్తున్నారు. జెన్‌కో స్థలంలో మరో చోట చెత్త పడేస్తున్నారు. నవభారత్ వెనుక పునాది రాయి అక్రమ తరలింపుతో అక్కడ లోతైన గుంతలు ఏర్పడగా ప్రస్తుతం వాటిలోనూ చెత్త పడేస్తున్నారు. ఇలా అనేక చోట్ల డంపింగ్ యార్డులు ఉండడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని పట్టణ వాసులు అంటున్నారు. డివిజన్‌లో 24 వార్డుల ద్వారా రోజుకు 18 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. తరలింపునకు 8 ట్రాక్టర్లు, 26 స్వచ్ఛ ఆటోలు నడుస్తున్నాయి.

ఒకేచోట డంప్ చేయాలి



పాల్వంచలో మూడు, నాలుగు చోట్ల చెత్త డంప్ చేస్తున్నారు. శివనగర్, మసీద్ గుట్ట, జెన్‌కో స్థలం, జగ్గుతండాల్లో చెత్త వేస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలవారు ఇబ్బంది పడుతున్నారు. కలెక్టర్ సూచించిన జగ్గుతండా వద్దే డంపింగ్ చేయాలి.

–సాంబశివరావు, పాల్వంచ

ఎక్కడ పడితే అక్కడే..



ఇల్లెందులో రోడ్డుపైనే వేసిన చెత్త

ఇల్లెందు: ఇల్లెందులో డంపింగ్ యార్డు ఉన్నా సేకరించిన చెత్త అక్కడికి చేరడం లేదు. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు వెంట పడేస్తుండగా వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పట్టణం నుంచి నిత్యం 8 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుండగా కొంత డంప్ యార్డుకు చేరుతున్నా.. అధికారుల పర్యవేక్షణ లోపంతో కొందరు డ్రైవర్లు రోడ్డుపైనే పడేస్తున్నారు. ఇక యార్డుకు చేరిన చెత్తను సైతం రీసైక్లింగ్ చేయడం లేదు. తడి చెత్తతో ఎరువు తయారు చేయాల్సి ఉండగా ఈ ప్రక్రియ కూడా అడుగంటింది. వార్డులకు రెండు, మూడురోజులకోసారి చెత్త వాహనం వస్తోంది. దీంతో ఇళ్లల్లో చెత్త నిల్వలు పెరిగి దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని పట్టణ వాసులు అంటున్నారు.

రోడ్డు పక్కన వేస్తున్నారు



డంప్ యార్డుకు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే చెత్త పడేస్తుండగా పక్క చేల్లోకి వస్తోంది. చెత్త నుంచి దుర్వాసన వస్తోంది. అన్ని రకాల మలినాలు, కోళ్ల, జంతువుల కళేబరాలు వదిలి వేస్తుండడంతో రోడ్డు వెంట ప్రయాణం చేయటం, సమీప రైతులు చేలలో పనులు చేసుకోవడం ఇబ్బందిగా మారింది.

– హరిప్రసాద్ యాదవ్, ఇల్లెందు

ఊరు శివారే ఆవాసం!



ప్రధాన రహదారి పక్కనే డంప్ చేసిన చెత్త

మణుగూరు టౌన్: వానాకాలం వస్తే మణుగూరులోని చెత్త డంపింగ్ యార్డుకు వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండదు. దీంతో చెత్త డంప్ చేసేందుకు పట్టణ శివారే దిక్కవుతోంది. పట్టణం నుంచి రోజుకు సుమారు 17 టన్నుల చెత్తను వాహనాల ద్వారా తరలిస్తారు. వర్షం పడితే డంప్‌యార్డ్ దారంతా బురదమయం అవుతుంది. రోడ్డు పక్కనే చెత్త పడేస్తుండడంతో పందులు స్వైర విహారం చేస్తుండగా దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతూ దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, ఈగలు, దోమలతో వ్యాధులు ప్రబలుతున్నాయని యార్డ్‌కు సమీపంలోని బెస్తగూడెం గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. డంప్‌యార్డ్‌ను మరో చోటకు మార్చాలంటున్నారు.

ఇంట్లో ఉండలేకపోతున్నాం



దోమలు, ఈగలతో నిత్యం చస్తున్నాం. వానాకాలం వచ్చిందంటే రోడ్డు బాగా లేదంటూ చెత్త బండ్లను ఇటే తీసుకొస్తున్నారు. చెత్త నుంచి వచ్చే దుర్గంధంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. దోమలతో సతమతం అవుతున్నాం.

– మర్రి వెంకటనర్సమ్మ, బెస్తగూడెం

చెత్త వేసే చోటే లేదు..



యార్డు బయట చెత్త కుప్పలు

అశ్వారావుపేట: అశ్వారావుపేట మున్సిపాలిటీలో నిత్యం వెలువడే చెత్త వేసేందుకు డంపింగ్ యార్డు ఉన్నా.. అది నిండిపోయి వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో యార్డుకు వెళ్లే దారిలోని వ్యవసాయ భూముల్లోనే వేస్తున్నారు. పేరుకు రెండెకరాల డంపింగ్ యార్డు ఉన్నా.. రోడ్డు పక్కనే చెత్త వేస్తుండడంతో మెరుపు కాలనీ, అటెండర్స్ కాలనీ, కోతమిషన్ బజారు వాసులు దుర్వాసన భరించలేకపోతున్నారు. చెత్త కాలిస్తే పొగ, ఈగల బెడద తీవ్రంగా ఉందని వాపోతున్నారు. పట్టణంలో చెత్త సేకరణకు 3 ట్రాక్టర్లు, 7 ట్రాలీలు వినియోగిస్తున్నారు. వీటి నిర్వహణకు నెలకు రూ.లక్ష డీజిల్‌కు, 40 మంది పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు రూ.6.64 లక్షలు వ్యయం అవుతోంది.

ఎవరికి చెప్పాలో తెలియడం లేదు



చెత్తను మా కాలనీ పక్కనే వేస్తున్నారు. ట్రాక్టర్లు, ఆటోలు వెళ్లేటపుడు వీధుల్లో పడుతోంది. రోజూ తగలబెడుతుండగా తట్టుకోలేని పొగ, కంపు కొడుతోంది. ఇంటి నిండా ఈగలు ముసురుతుంటాయి. మా బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

– కోరుకొండ రాజేశ్వరి, మెరుపు కాలనీ

ఉద్దీపనం పుస్తకాల్లో నాణ్యత ఉండాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం : విద్యార్థులకు అందించే ఉద్దీపనం పుస్తకాల్లో నాణ్యత పాటించాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల కోసం రూపొందించిన ఈ పుస్తకాల ముద్రణ టెండర్లను తన చాంబర్‌లో మంగళవారం ఆయన ఖరారు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం పుస్తకాలు ముద్రించాలని సూచించారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు 30,89,784 వర్క్‌బుక్‌లు ముద్రించి ఆయా పాఠశాలలకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ, ఏసీఎంఓ రమేష్, జీసీసీ డీఎం జయరాజ్, ఏటీడీఓ అశోక్ కుమార్‌తో పాటు ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ మండలాలకు చెందిన ప్రింటింగ్ ప్రెస్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.



ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

7న అశ్వారావుపేటలో గిరిజన దర్బార్

మారుమూల గ్రామాలకు చెందిన ఆదివాసీ గిరిజన కుటుంబాల సౌకర్యార్థం ఈనెల 7న అశ్వారావుపేటలో గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు పీఓ రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, యూనిట్ అధికారులు పూర్తి నివేదికలతో సోమవారం ఉదయం 10 గంటలకు అశ్వారావుపేట ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాల గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గిరిజన దర్బార్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

క్లుప్తంగా

సురక్ష బీమా యోజన గ్రామసభలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చుంచుపల్లి: జిల్లాలోని 97 గ్రామ పంచాయతీలు 130 గిరిజన గ్రామాల్లో కేంద్రం నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద నమోదు చేసే ప్రక్రియ నేపథ్యంలో ఈ నెల 3 నుంచి 10 గ్రామసభలు నిర్వహించాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన పేర్కొన్నారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె పలు సూచనలు చేశారు. గ్రామ పరిధిలో 100 శాతం సభ్యుల నమోదు చేయాలని, అందులో 18 – 70 ఏళ్ల వయస్సున్న వారికి అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు గ్రామసభల్లో తగిన ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సదస్సులో ఏపీఎంలు, సీసీలు, బ్యాంకు అధికారులు, వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల పునఃప్రారంభం



మాట్లాడుతున్న నాగయ్య

పినపాక: సుమారు 15 ఏళ్ల కిందట విద్యార్థులు లేకపోవడంతో మూసివేసిన పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం పునః ప్రారంభించారు. మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసివేశారు. గ్రామస్తులు, మహిళలు చొరవ తీసుకొని కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈఓ అనుమతితో పాఠశాలను తిరిగి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగయ్య, ఎంపీడీఓ సునీల్‌కుమార్, ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

పాల్వంచ: ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. స్థానిక ఇందిరానగర్ కాలనీలో పెనుగంటి రమేశ్ ఇంట్లో 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచడంతో ఎస్‌ఐ సుమన్ ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకుని సీజ్ చేసారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

లారీ బోల్తా.. ఉల్లిగడ్డలు మాయం!

వైరా: ఉల్లి గడ్డల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడగా.. అందులోని ఉల్లిగడ్డలను స్థానికులు తీసుకెళ్లిన ఘటన వైరా మున్సిపాలిటీ శివారు శాంతినగర్‌లో మంగళవారం జరిగింది. మహారాష్ట్ర నుంచి ఉల్లిగడ్డల లోడుతో రాజమహేంద్రవరం వెళ్తున్న లారీ మంగళవారం తెల్లవారుజామున అదుపు తప్పి రోడ్డు పక్కనే చెట్టును ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ విషయం తెలియడంతో శాంతినగర్, దిద్దుపూడి గ్రామస్తులు చేరుకుని దొరికనంత మేర ఉల్లిగడ్డల బస్తాలు తీసుకెళ్లారు. ఆతర్వాత చేరుకున్న లారీ యజమానులు మరో లారీలో ఉల్లిగడ్డలను పంపించారు.

లాభాల పేరిట నగదు స్వాహా

చింతకాని: ప్రముఖ సంస్థల్లో పెట్టుబడి పెడితే నగదు రెట్టింపు అవుతుందని నమ్మించిన సైబర్ నేరగాళ్లు ఓ వ్యక్తి నుంచి రూ.28,900స్వాహా చేశారు. మండలంలోని నాగులవంచకు చెందిన మొగిలి అశోక్ సెల్‌ఫోన్‌కు ఇటీవల సైబర్ నేరగాళ్లు ఒక లింక్ పంపారు. ఈ లింక్‌ను ఓపెన్ చేసి కొంత నగదు పెట్టుబడి పెడితే రెట్టింపవుతుందని నమ్మించడంతో ఆయన లింక్‌ను ఓపెన్ చేయగానే ఖాతా నుంచి ఉన్న రూ.28,900 నగదు మాయమైంది. దీంతో మోసపోయినట్లు గుర్తించిన అశోక్ చేసిన ఫిర్యాదుతో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

ఎదురెదురుగా ఢీకొన్న కారు, డీసీఎం

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెన సమీపాన జాతీయ ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి ఎదురెదురుగా కారు, డీసీఎం వ్యాన్ ఢీకొన్నాయి. వైరా వైపు నుండి తల్లాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చిన డీసీఎం వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకున్నా ప్రధాన రహదారిపై ప్రమాదం జరగడం, భారీ వర్షం కురుస్తుండడంతో రాకపోకలు నిలిచిపోగా ఎస్సై పుష్పాల రామారావు, సిబ్బందితో చేరుకుని జేసీబీతో వాహనాలను పక్కకు తప్పించారు. దీంతో రాకపోకలు మొలయ్యాయి.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.18,748

అవే.. తిప్పలు తప్పవా..?

- లో-లెవెల్ వంతెనలతో ప్రజల కష్టాలు
- అనేక గ్రామాలకు నిలిచిపోనున్న రాకపోకలు
- వర్షాలు, వరదలతో తీవ్ర నష్టం



భారీ వరదలకు మునిగిపోయిన పెనుబల్లి లో-లెవెల్ వంతెన (ఫైల్)



సుజాతనగర్ మండలంలో రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న గరీబ్‌పేట వాగు (ఫైల్)

చుంచుపల్లి: వర్షాకాలం వచ్చిందంటే లోతట్టు ప్రాంతాల ప్రజలు వణికిపోతారు. ప్రతి సీజన్‌లోనూ ఏజెన్సీ ప్రాంత వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు, వరదలతో అనేక గ్రామాలకు లో-లెవెల్ చప్టాలతో రోజుల కొద్దీ రాకపోకలు స్తంభిస్తాయి. అవి దాటే ప్రయత్నంలో ఎదరో ప్రాణాలు పోగొట్టుకున్నారు. జిల్లాలో అనేకగ్రామాలకు ఇప్పటికీ రహదారులు, సరైన వంతెన సౌకర్యం లేదు. అత్యవసరమైన చోట హై-లెవెల్ వంతెనలు నిర్మించక పోవడంతో వర్షాకాలం సీజన్ మొత్తం ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారు. వాగులు, వంకలపై ఎప్పుడో నిర్మించిన లో-లెవెల్ చప్టాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రతిపాదనలకు పరిమితమయ్యారు.

జిల్లాలో.. లో-లెవెల్ వంతెనలు, కల్వర్టులు..

పీఆర్ లో-లెవెల్ చప్టాలు:	102
ఆర్‌అండ్‌బీ లో-లెవెల్ చప్టాలు:	91
ఎక్కువ వరద పోటుకు గురయ్యేవి:	67
ఎక్కువ ప్రవాహం వచ్చేవి:	43
మధ్యతరహా వరదపోటుకు గురయ్యేవి:	35
మధ్యతరహా వరద కాజ్‌వేలు:	48

గ్రామాలకు రాకపోకలు బంద్

జిల్లాలో 35కు పైగా చిన్న, పెద్ద తరహా వాగులు ఉన్నాయి. ఇవి వర్షాకాలంలో పొంగి పొర్లడంతో అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. ప్రధానంగా జూలై, ఆగస్టు మాసాల్లో కురిసే అతి భారీవర్షాలు, వరదలకు ఎక్కువ ప్రాంతాలు పూర్తిగా జలమయమవుతుంటాయి. లో-లెవెల్ వంతెనలు, కల్వర్టులు వరద పోటుకు గురవడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పాల్వంచ, ములకలపల్లి, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల, జూలురుపాడు, అశ్వాపురం, చర్ల, పినపాక, బూర్గంపాడు, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పినపాక, కరకగూడెం, దుమ్ముగూడెం, అశ్వారావుపేట మండలాల పరిధిలోని అనేక గ్రామాలకు చెందిన ప్రజలకు వరద కష్టాలు తప్పడం లేదు. కిన్నెరసాని గేట్లు ఎత్తితే 24 గ్రామాలపై ప్రభావం పడుతుంది.

వరదలతో నష్టాలు

2022 జూలై 16న వచ్చిన వరదతో గోదావరి 70.3 అడుగుల స్థాయిలో ప్రవహించింది. పరిసర గ్రామాలు నీట మునిగాయి. భారీగా నష్టం వాటిల్లింది. జిల్లాలోని 120 గ్రామాలకు చెందిన 16 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా, సుమారు రూ.120కోట్ల మేర నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. దాదాపు 10 వేల ఎకరాలకుపైగా పంటల నష్టం జరిగింది. సుమారు 5,400 ఎకరాల్లో పంటలు పూర్తిగా ధ్వంసం కావటంతో రూ.6.50 కోట్ల మేర నష్టం జరగగా.. ఉద్యాన పంటల నష్టం రూ.40.58 లక్షల వరకు ఉంది. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ పరిధిలోని రోడ్లు వరద తాకిడి కోతకు గురయ్యాయి. పంచాయతీరాజ్ శాఖకు రూ.9.08కోట్లు, ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.94 లక్షలు, ఎస్‌హెచ్‌లకు రూ.2.52 కోట్ల మేర నష్టం జరిగింది. సబ్‌స్టేషన్ల ధ్వంసం, స్తంభాలు కొట్టుకపోవడంతో విద్యుత్ శాఖకు రూ.5.80 కోట్ల నష్టం వాటిల్లింది. మిషన్ భగీరథకు సంబంధించి 212 హాబిటేషన్లలో పంపుసెట్లు, ప్యానల్‌బోర్డులు, మంచినీటి పైప్‌లైన్లు, ఇంటేక్‌వాల్స్ వరద పోటుకు గురవ్వడంతో రూ.1.17 కోట్ల మేర నష్టం జరిగింది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు



పంచాయతీరాజ్ పరిధిలోని లో-లెవెల్ చట్టాల మరమ్మతులతో పాటు కొత్త వాటి కోసం నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇక వచ్చే వర్షాలు, వరదలను దృష్టిలో పెట్టుకొని లో-లెవెల్ వంతెనల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నాం. వీఆర్వోలు, సెక్రటరీలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రజలు ప్రవాహం దాటకుండా అడ్డుగా ట్రాక్టర్లు, ఇతర వాహనాలను పెట్టడమే కాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

–శ్రీనివాసరావు, పంచాయతీరాజ్, ఈఈ

నర్సరీ యజమానులకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జంగా కిశోర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మిరప, కూరగాయల నారు పెంచే నర్సరీ యజమానులకు మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి జంగా కిశోర్ మాట్లాడుతూ.. జిల్లాలోని నర్సరీల్లో పలు పంటలకు చెందిన నారు 29.4 కోట్ల మేర ఉత్పత్తి జరుగుతోందని, జిల్లాలో మిరప 17,589 ఎకరాల్లో సాగు చేస్తున్నారని, సుమారు రెండు వేల కేజీల మిరప విత్తనం నుంచి 20 కోట్ల మిరపనారు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. నర్సరీలన్నీ కొత్త నర్సరీ నియంత్రణ నియమావళి-2017 ప్రకారం నాణ్యమైన, ప్రాచుర్యంలో ఉండి పేరెన్నిక గల అధిక దిగుబడినిచ్చే రకాలను పెంచి రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. సదస్సులో ఉద్యాన అధికారులు జి.దేవప్రసాద్, కె.మీనాక్షి, ఎం.స్రవంతి, బి.స్రవంతి, సీహెచ్ సాయికృష్ణ, జిల్లాలోని వివిధ నర్సరీల యజమానులు పాల్గొన్నారు.

పాటించాల్సిన నిబంధనలు

- రైతులు అంగీకారం తెలిపిన, పేరు గాంచిన రకాలను వ్యవసాయ శాఖ ద్వారా ఆమోదం పొందిన రకాల నారు పెంచాలి
- ఆరుబయట నారును పెంచవద్దు
- నర్సరీ లైసెన్స్ లేకుండా మిరప, కూరగాయలు మొదలైన నారు అమ్మవద్దు
- నర్సరీ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 5 రకాలైన రిజిస్టర్లను విధిగా రాయాలి
- నారుకు సంబంధించిన లాట్ నంబర్, బ్యాచ్ నెంబర్, విత్తన ధ్రువీకరణ సర్టిఫికెట్ కాపీలను అందుబాటులో ఉంచాలి
- నర్సరీలో పెంచిన రకాల కంపెనీ వివరాలను ఎత్తుమడుల్లో ప్రదర్శించాలి
- రైతులకు తప్పనిసరిగా నారుకు సంబంధించిన లాట్ నంబర్, బ్యాచ్ నంబర్, తేదీలతో కూడిన బిల్లు అందించాలి.
- నర్సరీ నియమ, నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయి.

ప్రభుత్వ ఆస్పత్రిలో శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని కుటుంబ సభ్యుల ఆరోపణ



ఆస్పత్రి వద్ద బాలుడి కుటుంబ సభ్యులు

పాల్వంచ: తొమ్మిది నెలలు నిండిన గర్భిణి ప్రసవం కోసం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి రాగా సకాలంలో వైద్యులు స్పందించక పోవడంతో శిశువు కడుపులోనే మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. బాధితుల కథనం మేరకు.. లక్ష్మీదేవిపల్లి మండలం తోకబంధాల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కోరెం రాంప్రసాద్ భార్య కరుణ గర్భిణి కాగా నెలలు నిండటంతో ప్రసవం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రికి మంగళవారం ఉదయం తీసుకొచ్చారు. అయితే వైద్యులు సాధారణ కాన్పు కోసం మధ్యాహ్నం 12గంటల వరకు ప్రయత్నించారు. అనంతరం ఆపరేషన్ చేయగా.. బాబు గర్భంలోనే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు బోరుమన్నారు. అనంతరం ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. రాంప్రసాద్, ఆయన బంధువు రాము మాట్లాడుతూ.. కేవలం వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలుడు మృతి చెందాడని, ఉదయం 7 గంటలకు ఆస్పత్రిలో చేరితే ఆలస్యం చేశారని, కరుణ ఎంత ప్రాధేయపడినా చేయలేదని, చివరికి ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి కడుపులోనే చనిపోయాడని బిడ్డను చేతిలో పెట్టారని కన్నీటి పర్యంతమయ్యారు. ఉన్నతాధికారులు స్పందించి, పూర్తి విచారణచేసి ఆపరేషన్ చేసిన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్‌ను వివరణ కోరగా ఉమ్మనీరు, మలమూత్రం మింగడం, మెడలో పేగు వేసుకుని ఉండటంతో ఊపిరాడక మృతి చెందాడని, వైద్యుల తప్పిదం ఏమీలేదని, వారు తమవంతు కృషి చేశారని, శిశువు మృతి చెందడం తమకు కూడా బాధాకరమని తెలిపారు.

పెదవాగులో చేరిన వరదనీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న పెదవాగు



వరినారు మడుల్లో చేరిన వరదనీరు

అశ్వారావుపేటరూరల్: మండలంలో రెండు రోజులుగా వర్షం కురుస్తుండగా, సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఎడతెరిపిలేకుండా భారీ వర్షం కురిసింది. అశ్వారావుపేటతో పాటు మండలంలోని కావడిగుండ్ల, కంట్లం, అనంతారం, గాండ్లగూడెం, గుమ్మడవల్లి, నారాయణపురం, వినాయకపురం, తిరుమలకుంట, నందిపాడు, అచ్యుతాపురం, నారంవారిగూడెంతోపాటు అన్నీ గ్రామాల్లో జోరుగా వర్షం కురిసింది. భారీ వర్షాలతో పెదవాగుతోపాటు పంట పొలాల్లోకి వరదనీరు పొటెత్తింది. పెదవాగు నిండుగా ప్రవహించగా, ప్రాజెక్టులో తాత్కాలికంగా గతేడాది నిర్మించిన రింగ్‌బండ్‌కు వరదనీరు పోటెత్తింది. విస్తారంగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

నాణ్యమైన విద్యే భవిష్యత్‌కు పునాది



విద్యార్థినులతో మాట్లాడుతున్న జీసీడీఓ అన్నమణి

కరకగూడెం: నాణ్యమైన విద్యే భవిష్యత్‌కు పునాది అని జీసీడీఓ అన్నమణి పేర్కొన్నారు. మంగళవారం ఆమె పినపాక, కరకగూడెం మండలాల్లోని ఎల్చిరెడ్డిపల్లి, భట్టుపల్లి కేజీబీవీలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. విద్యార్థినుల హాజరు పట్టిక, బోధనా ప్రణాళికలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, ఆరోగ్య రికార్డులు తనిఖీ చేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. బోధనా ప్రమాణాలను మెరుగుపరచాలని, పాఠ్యపుస్తకాల లభ్యత, అభ్యసన, వాతావరణం వంటి అంశాలపై విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జి.పద్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగోలో జిల్లా వాసి మృతి



ఘటనా స్థలంలో అనీశ్ మృతదేహం

కొత్తగూడెంఅర్బన్: దక్షిణాఫ్రికా ఖండం కాంగోలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ పంచాయతీకి చెందిన సయ్యద్ అనీశ్ (45) మృతి చెందాడు. లక్ష్మీదేవిపల్లి పోలీసుల కథనం ప్రకారం.. పదేళ్ల కిందట దుబాయ్ వెళ్లిన అనీశ్.. అక్కడ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా కాంగో వెళ్లిన అనీశ్ కారులో ప్రయాణిస్తుండగా జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్రమాద ఘటనను అక్కడి దేశస్తులు స్థానిక పోలీసులకు తెలపగా వారు అనీశ్ తండ్రి అక్రమ్‌కు, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఢిల్లీలో ఉండి ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అనీశ్ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పి ఓదార్చారు.

చికిత్స పొందుతున్న వివాహిత మృతి

దుమ్ముగూడెం: మండలంలోని నందులచలక గ్రామానికి చెందిన గుండి నాగమణి (30) పురుగులమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఎస్‌ఐ గణేశ్ కథనం ప్రకారం.. నాగమణి గత నెల 22వ తేదీన కుటుంబ గొడవల కారణంగా పురుగులమందు తాగింది. అప్పటి నుంచి వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి భర్త గుండి భద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

పాల్వంచరూరల్: ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టగా ముగ్గురు గాయపడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఉల్వనూరు నుంచి పాల్వంచ వైపు వస్తున్న ఆటోను వేగంగా వచ్చిన ట్రాక్టర్ యూటర్న్ తీసుకుంటూ ఢీకొట్టింది. ఆటోడ్రైవర్ కొక్కు యాదగిరి, బుల్లి, గండికోట రమేశ్ గాయపడ్డారు. ఆటోడ్రైవర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ట్రాక్టర్ డ్రైవర్ కాలం ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామానికి చెందిన వ్యక్తిపై మంగళవారం అశ్వాపురం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మల్లెలమడుగు గ్రామ పంచాయతీలోని చింతకుంట గ్రామానికి చెందిన గిరిజన యువతి పొలంలో ఉండగా మొండికుంట గ్రామానికి చెందిన తోవిటి యాదగిరి అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ అనంతరం మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుప్రసాద్ తెలిపారు.

‘స్థానిక’ ఎన్నికల్లో సత్తా చాటాలి..



మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

కొత్తగూడెంఅర్బన్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని సత్తా చాటుదామని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని బంగారుచెలక, మైలారం, గట్టుమల్ల, రేగళ్ల, లక్ష్మీదేవిపల్లి, చాతకొండ, సీతారాంపురం, తెలగరామవరం, హేమచంద్రాపురం గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశాలకు హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, రూ.22 వేల కోట్లతో రైతుభరోసా అమలు చేసిందని, రూ.12 వేల కోట్లతో పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తోందని, 55 లక్షల ఇళ్లకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని, ఉచిత బస్సు పథకానికి రూ.4 వేలకోట్లు ఖర్చుపెడుతున్నట్టు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆళ్ల మురళి, తూము చౌదరి, పెద్దబాబు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఎప్‌సెట్ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

- తొలిరోజు మొరాయించిన సర్వర్
- గంటల తరబడి వేచి ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగి

ఖమ్మం సహకారనగర్: ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ మంగళవారం మొదలైంది. ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటుచేయగా, ఉదయం 9నుంచి సాయంత్రం 6-30గంటల వరకు సర్టిఫికెట్లు పరిశీలిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే, చాలా మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి ఉదయం 8-30గంటలకల్లా కేంద్రానికి చేరుకున్నారు. రెండు రోజుల నుంచి స్లాట్ బుకింగ్‌కు అవకాశం కల్పించగా, తొలిరోజు 570మంది విద్యార్థులకు గాను 510మంది సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు.

ఇతర జిల్లాల నుంచి సైతం...

ఖమ్మంలోని ఎప్‌సెట్ కౌన్సెలింగ్ కేంద్రానికి ఉమ్మడి జిల్లా నుంచే కాక సమీప జిల్లాల విద్యార్థులు సైతం హాజరయ్యారు. రాష్ట్రంలో ఎక్కడైనా కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అవకాశం ఉండడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం సహా మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల విద్యార్థులు కూడా వచ్చారు. కాగా, సెంటర్ వద్ద పలు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల సిబ్బంది తమ కళాశాలల్లో చేరాలంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బ్రోచర్లు ఇస్తూ ప్రచారం చేయడం కనిపించింది.

సర్వర్ మొరాయింపు

కౌన్సెలింగ్‌కు మొదటిరోజైన మంగళవారం ఎక్కువ మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకున్నారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండడంతో సర్వర్ మొరాయించింది. దీంతో సర్టిఫికెట్ల పరిశీలన నత్తనడకన కొనసాగగా విద్యార్థులు, తల్లిదండ్రులు గంటల తరబడి వేచిచూడాల్సి రావడంతో అసహనానికి గురయ్యారు.

సీఎస్‌సీ ఎంచుకుంటా..



ఇంజనీరింగ్ హైదరాబాద్‌లో చదవాలని నిర్ణయించుకున్నా. ఇప్పటికే మా సోదరి అక్కడే చదువుతోంది. దీంతో నేను కూడా మంచి కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ కమ్యూనికేషన్(సీఎస్‌సీ) కోర్సు చదవాలని భావిస్తున్నా. –జి.కీర్తిప్రియ, పాతలింగాల

మంచి కళాశాల కోసం..



హైదరాబాద్‌లో మంచి కళాశాలను ఎంచుకునేలా ఇప్పటికే జాబితా రూపొందించుకున్నా. ఈసీఈ కోర్సు చదవాలనేది లక్ష్యం. సరైన కళాశాలను ఎంచుకుంటే మంచి ఫలితం ఉంటుంది.

– రాంచరణ్, ఖమ్మం

బ్లడ్ బ్యాంక్‌లో డీఎంహెచ్‌ఓ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మంలోని డాక్టర్స్ వాలంటరీ బ్లడ్‌బ్యాంక్‌ను డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి మంగళవారం తనిఖీ చేశారు. మహబూబాబాద్ జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణతో కలిసి తనిఖీ చేసిన ఆమె రక్తసేకరణ, నిల్వలకు ఉన్న వసతులు, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. శిక్షణ పొందిన వైద్యులు, సిబ్బందితో బ్లడ్ బ్యాంక్ నిర్వహించాలని సూచించారు. డిప్యూటీ డెమో జి.సాంబశివరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.